# పూజలు.. నిమజ్జనాలు

- పలు ప్రాంతాల్లో పూజలు, శోభాయాత్రలు నిర్వహించిన మండప నిర్వాహకులు
- లంబోదరుడి లడ్డు వేలం పాటలో పాల్గొన్న భక్తులు, ఎమ్మెల్యే శ్రీగణేశ్, తదితరులు


లాల్‌బజార్‌లోని స్టార్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పార్వతీ తనయుడికి పూజలు నిర్వహించిన భక్తులు, అసోసియేషన్ సభ్యులు

బొల్లారం, సెప్టెంబర్ 16: పలు ప్రాంతాల్లో అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలందుకున్న గణ నాయకులు నిమజ్జనానికి తరలి వెళ్లారు. సాయంత్రం వివిధ కాలనీలు, గల్లీల్లో కొలువైన మూషికవాహనులు శోభాయాత్రతో తరలివెళ్లాయి. రంగు రంగుల పూలు, విద్యుత్ దీపాలతో సుందరీకరించారు. గణపతిబప్పా మోరియా.. ఆదా లడ్డూ చోరియా అంటూ భక్తులు శోభాయాత్రలు నిర్వహించారు. కొన్ని మండపాల్లో లంబోదరుడి లడ్డూ కోసం భక్తులు వేలంలో పోటీపడి మరీ కొనుగోలు చేశారు. కొన్ని ప్రాంతాల్లో గణపతులు గంగమ్మ ఒడికి చేరగా, నేడు పూర్తి స్థాయిలో జనం నుంచి జలంలోకి చేరనున్నాయి.

### రాణాప్రతాప్ యువసేన ఆధ్వర్యంలో

న్యూ బోయిన్‌పల్లి ప్రభుత్వ బాలుర పాఠశాల సమీపంలోని విద్యావతి గణపతి ఆలయ ఆవరణలో రాణాప్రతాప్ యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక నిమజ్జన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీగణేశ్, బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, సీనియర్ నాయకులు దండుగుల యాదగిరి, భానుక మల్లికార్జున్, బీఎన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### స్టార్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో

లాల్‌బజార్‌లోని స్టార్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పార్వతీతనయుడికి పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించి గణనాథుడిని ట్యాంక్‌బండ్‌లో నిమజ్జనానికి తరలించారు. ఎనిమిది ఏండ్లుగా లంబోదరుడి ఏర్పాటు చేసున్నారు.


రాణాప్రతాప్ యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక నిమజ్జనంలో పాల్గొన్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్, బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, తదితరులు

### పూజలందుకున్న గణనాథులు

అడ్డగుట్ట: నార్త్ లాలాగూడ ఇందిరానగర్ డీ కాలనీలో శ్రీసిద్ధి వినాయక యూత్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడి పూజలో సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు తనయుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రామేశ్వర్‌గౌడ్ పాల్గొని పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను నిర్వాహకులు పాలకూర శ్రీనివాస్‌గౌడ్ శాలువాతో ఘనంగా సన్మానించారు. పూజలో ముఖేశ్‌గౌడ్, చంద్రశేఖర్, నిఖిల్, సాయివంశి తదితరులు పాల్గొన్నారు.

### కార్పొరేటర్ ఆధ్వర్యంలో

అడ్డగుట్ట: గణేశ్ ఉత్సవాల్లో భాగంగా మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత రమేశ్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా కార్పొరేటర్ నివాసం వద్ద ఏర్పాటు చేసిన గణేశ్ మండపం వద్ద చిన్నారులకు పలు సాంస్కృతిక పోటీలను నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన వారికి కార్పొరేటర్ బహుమతులను అందజేసి అభినందనలు తెలిపారు.

### వారాసిగూడలో

సికింద్రాబాద్: గణపతి నిమజ్జనాల సందర్భంగా చిలుకలగూడ, వారాసిగూడ పోలీస్ స్టేషన్ల పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. వాహనాలు సక్రమంగా పోయేందుకు చిలకలగూడ ట్రాఫిక్ పోలీసులు రాత్రి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఇన్‌స్పెక్టర్లు అనుదీస్, సైదులు, చింతకింద శ్రీనివాస్, ఎస్ఐ కరుణాకర్ రూట్‌మాప్‌ను రూపొందించి ట్రాఫిక్ జాం కాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. వారాసిగూడలో భజరంగ్ ఎవెన్యూ అపార్ట్‌మెంట్‌లో టీమ్ వైఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేశుడిని నిమజ్జనానికి ట్యాంక్ బండ్‌కు తరలించారు. కార్యక్రమంలో నిర్వాహకులు మద్దెర్ల సృజన్‌కుమార్, శ్రీకర్, సూర్య, నాగ వెంకట్‌రాజ్, మద్దెర్ల సాత్విక్, సోను, వంశీ, అజయ్, పృథ్వి, కళ్యాణ్, మద్దెర్ల శకుంతల పాల్గొన్నారు.

## లడ్డూ దక్కించుకున్న చావా కుటుంబం



అమీర్‌పేట్, సెప్టెంబర్ 16: ఎస్ఆర్‌నగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గణేశ్ మండపంలో సోమవారం జరిగిన లడ్డూ వేలం జరిగింది. ఈసారి రూ.55,116లకు అసోసియేషన్ ఉపాధ్యక్షుడు చావా కోటేశ్వర్‌రావు స్వామి వారి మహాప్రసాదమైన లడ్డూను సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా చావా కోటేశ్వర్‌రావు, సతీమణి ఝాన్సీ, కుమార్తె సాయి స్పందన, కుమారుడు రాకేశ్, ఫణిశ్రీ దంపతులు, మనవలు అద్విత్, ఆర్యానాకు అసోసియేషన్ ప్రతినిధులు అభినందనలు తెలిపారు.


వికెట్ లక్ష్మీనగర్‌లో పూజల్లో పాల్గొన్న కంటోన్మెంట్ వికాస్ మంచ్ నేత సంకి రవీందర్, స్వరూప్, సత్యనారాయణ తదితరులు


స్టార్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పూజలందుకున్న గణనాథుడు


పూజల్లో పాల్గొన్న సికింద్రాబాద్ ఎమ్మెల్యే తనయుడు రామేశ్వర్‌గౌడ్


అమీర్‌పేట్: ఎస్ఆర్‌నగర్ శ్రీ వెంకటేశ్వర సంక్షేమ సంఘం గణేశ్ మండపంలో నిర్వాహకులు


వేడుకల్లో పాల్గొన్న చిన్నారులతో మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత


అమీర్‌పేట్: సనత్‌నగర్ సుభాష్‌నగర్ గణేశ్ మండపంలో బీజేపీ నాయకుడు వెల్లాల రామ్మోహన్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

## నిమజ్జనం సజావుగా సాగేలా చర్యలు



చిలకలగూడ మైదానంలో నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీసీ సుభాష్‌రావు

అడ్డగుట్ట, సెప్టెంబర్ 16: వినాయక నిమజ్జనం సజావుగా సాగేలా అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ సుభాష్‌రావు అన్నారు. సోమవారం చిలకలగూడ మున్సిపల్ మైదానాన్ని పరిశీలించిన ఆయన గణేశ్ నిమజ్జనాలు జరుగుతున్న తీరును అధికారుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణపతి నిమజ్జనాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అధికారులు, నిర్వాహకులు, పోలీసులు సమన్వయంతో ప్రశాంతంగా జరిగేల చూడాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా విభాగాల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## స్తంభాన్ని ఢీకొట్టిన నిమజ్జన వాహనం


సీతాఫల్‌మండి చౌరస్తాలో నిమజ్జన వాహనం ఢీకొట్టడంతో కూలిన స్తంభం

సికింద్రాబాద్, సెప్టెంబర్ 16: సీతాఫల్‌మండి చౌరస్తాలో హైమాస్ట్ లైట్ల స్తంభానికి వినాయక నిమజ్జనానికి వెళ్లి వస్తున్న వాహనం ఢీకొట్టగా స్తంభం ఆవాహనంపై కూలింది. ఆసమయంలో అందులో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదమే తప్పింది. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. వివరాల్లోకి వెళితే వినాయక నిమజనం నిమిత్తం ట్యాంక్‌బండ్‌కు వెళ్లిన భారీ వాహనం సోమవారం ఉదయం నిమజ్జనం ముగించుకొని వారాసిగూడకు వెళ్తుండగా సీతాఫల్‌మండి చౌరస్తాకు రాగానే హైమాస్ట్ లైట్ల స్తంభానికి ఢీకొట్టింది. వాహనం వెనుక భాగంపై పడడంతో పెద్ద ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న జీహెచ్ఎంసీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని స్తంభాన్ని తొలగించి ట్రాఫిక్ క్లియర్ చేశారు.

## శోభయాత్రలో ఇబ్బందులు లేకుండా చూడాలి

### ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్



బేగంపేట్, సెప్టెంబర్ 16: గణేశ్ శోభయాత్ర, నిమిజ్జనం సందర్భంగా భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. నవరాత్రులు పురస్కరించుకొని పలు ప్రాంతాల్లో గణపతి విగ్రహాలను ఏర్పాటు చేసి 9 రోజులు నిత్యం పూజలు నిర్వహించారని తెలిపారు. ప్రతిష్ఠించిన గణనాథుల నిమజ్జనం నిమజ్జనం సందర్భంగా వీక్షించేందుకు లక్షలాది మంది వస్తారని వివరించారు. దీనిని దృష్టిలో ఉంచుకొని అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు. భక్తులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని, తద్వారా ప్రశాంత వాతావరణంలో గణేశ్ నిమజ్జన కార్యక్రమం కొనసాగేలా చూడాలని అధికారులకు సూచించారు.

### భక్తులకు ఇబ్బందులు కలిగించొద్దు

బేగంపేట్, సెప్టెంబర్ 16: గణేశ్ మండపాల వద్ద ఉత్తర మండలం పోలీసులు నిర్వహిస్తున్న తీరుపై మండప నిర్వహకులు, భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రాంగోపాల్‌పేట్, మహంకాళి, మార్కెట్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఏర్పాటు చేసిన గణేశ్ మండపాల వద్ద పోలీసుల వ్యవహారం తీరుకు భక్తుల అగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజుల్లో మహంకాళి, మార్కెట్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో రెండు ఘటనలు వరుసగా చోటు చేసుకోవడంతో భక్తుల మనోభావాలు దెబ్బతీయకుండా పోలీసుల తీరు ఉండాలని కోరుతున్నారు. రాష్ట్రపతి రోడ్డులో మాజీ కార్పొరేటర్ మల్లికార్జున్‌గౌడ్ ఏర్పాటు చేసిన గణేశ్ మండపం వద్ద కూడా ఆందోళన వ్యక్తం చేశారు. నిమజ్జన శోభయాత్రలో పోలీసులు సహనంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## మహా విజ్ఞాన సమ్మేళనం పోస్టర్ ఆవిష్కరణ


కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మహా జ్ఞాన సమాజం అధ్యక్షుడు విశ్వనాథ్ గోవిఅంస, ఉపాధ్యక్షుడు తూర్పాటి శ్రీనివాస్ తదితరులు

ఖైరతాబాద్, సెప్టెంబర్ 16: మహా జ్ఞాన సమాజం ఆధ్వర్యంలో అక్టోబర్ 6న అశోక విజయద దశమి సందర్భంగా మహా విజ్ఞాన సమ్మేళనం నిర్వహించనున్నట్లు మహా జ్ఞాన సమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు విశ్వనాథ్ గోవి అంస తెలిపారు. సమ్మేళన పోస్టర్లను సోమవారం సాయంత్రం హుస్సేన్ సాగర్‌లోని గౌతమ బుద్ధుడి విగ్రహం, 125 అడుగుల డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం వద్ద మహా జ్ఞాన సమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు, సైకాలజిస్ట్ విశ్వనాథ్ గోవి అంస, ఉపాధ్యక్షుడు తూర్పాటి శ్రీనివాస్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే నెల 6న జరిగే సమ్మేళనానికి ప్రతి ఒక్కరూ హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల ప్రతినిధులు కృష్ణ, లక్ష్మణ్, అశోక్, నగేశ్, నవీన్ శీల్‌వాన్, హర్ష, సందీప్, దీక్షిత్, ప్రజ్ఞ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మిలాద్-ఉన్-నబీ సందర్భంగా అన్నదానం

బన్సీలాల్‌పేట్, సెప్టెంబర్ 16: మహ్మద్ ప్రవక్త జయంతి రోజైన 'మిలాద్-ఉన్-నబీ' పర్వదినం సందర్భంగా సోమవారం బన్సీలాల్ పేట్‌లో అన్నదానం నిర్వహించారు. నుస్రత్ భాయ్ సోదరుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి బీఆర్ఎస్ నాయకుడు కె.లక్ష్మిపతి హాజరై అన్నదానం ప్రారంభించారు. హిందూ, ముస్లిం ప్రజలు సోదరభావంతో కలిసిమెలిసి అన్ని పండగలు నిర్వహించుకోవడం ఎంతో అభినందనీయమని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఆయన మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు జావెద్, రుక్ముద్దీన్, ఆజం, నాయకులు పాల్గొన్నారు.


బన్సీలాల్‌పేట్‌లో చిన్నారులకు అన్నదానం చేసిన నిర్వాహకులు

## ఉరేసుకొని నర్సు అనుమానాస్పద మృతి


శృతి(ఫైల్)

శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 16: గచ్చిబౌలిలోని ఓ లాడ్జ్‌లో నర్సు ఉరేసుకొని అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. మాదాపూర్ ఏసీపీ శ్రీకాంత్, గచ్చిబౌలి సీఐ ఆంజనేయులు తెలిపిన ప్రకారం.. మహబూబ్‌నగర్ జడ్చర్ల ప్రాంతానికి చెందిన గొల్ల వెంకటయ్య, స్వర్ణలత దంపతులకు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. పెద్దకూతురు శ్రుతి(23) నర్సింగ్‌కోర్సు పూర్తి చేసి నగరంలోని నార్సింగి అలోన్ హాస్పిటల్‌లో నర్సుగా పనిచేసింది. అనంతరం గచ్చిబౌలిలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో నర్సుగా కొద్దిరోజుల కిందట విధుల్లో చేరింది. ఇటీవల శ్రుతి స్కూటీపై నుంచి కిందపడగా.. గాయాలు కావడంతో డ్యూటీకి వెళ్లకుండా తల్లిదండ్రులతో జడ్చర్లలో ఉన్నది. కాగా, శనివారం 14వ తేదీన షాద్‌నగర్ ప్రాంతానికి చెందిన స్నేహితురాలు మౌనికతో కలిసి శ్రుతి నగరానికి వచ్చింది. హైదరాబాద్‌కు మౌనికతో వెళ్తున్నానని, అలాగే హాస్పిటల్‌కు వెళ్లి తన జీతం తీసుకొని వస్తానని తల్లిదండ్రులకు చెప్పి వెళ్లింది. కాగా, శ్రుతి, మౌనిక, విద్యపోగు జీవన్‌పాల్, పిన్నెల్లి వెంకటేశ్‌లు నలుగురు స్నేహితులు శనివారం రాత్రి 8 గంటల సమయంలో నిమజ్జనం చూసేందుకు వచ్చామని చెప్పి నగరంలోని గచ్చిబౌలి చిన్నఅంజయ్యనగర్ రెడ్ స్టోన్ లాడ్జిలో రెండు గదులు తీసుకున్నారు. లాడ్జిలోని 301 గదిలో శ్రుతి, జీవన్‌పాల్, 505లో మౌనికా, వెంకటేశ్ ఉన్నారు. ఆదివారం సాయంత్రం నలుగురు కలిసి లాడ్జిలోని 301 గదిలో మద్యం సేవించారు. కాసేపటికి శ్రుతి తలనొప్పిగా ఉందని మిత్రులకు చెప్పి 505 గదిలో పడుకుంటానని వెళ్లగా, రాత్రి 9:30 గంటల సమయంలో సికింద్రాబాద్‌లో ఉంటున్న వెంకటేశ్ స్నేహితుడు కాలనీలో నిమజ్జనం చూసేందుకు వెళ్లేందుకు శ్రుతి గదికి వెళ్లి తలుపు తట్టారు. ఆమె తీయకపోవడంతో నిద్రపోతుందనుకొని మౌనిక, వెంకటేశ్, జీవన్ ముగ్గురు నిమజ్జనం చూసేందుకు వెళ్లారు. సోమవారం ఉదయం ముగ్గురు తిరిగి గచ్చిబౌలిలోని లాడ్జికి వచ్చి 505 గదికి వెళ్లి ఎంత పిలిచినా శ్రుతి తలుపు తీయకపోవడం, లోపలి నుంచి గడియపెట్టి ఉండటంతో అనుమానం వచ్చి లాడ్జి సిబ్బంది సాయంతో తలుపుతీసి చూశారు. గదిలో శ్రుతి బెడ్ రన్నర్ క్లాత్‌తో ఫ్యాన్‌కు ఉరివేసుకుంది. ఈ విషయం స్నేహితులు శ్రుతి తండ్రికి సమాచారం అందించగా.. ఆమె తల్లిదండ్రులు, బంధువులు గచ్చిబౌలిలోని రెడ్‌స్టోన్ లాడ్జికి చేరుకున్నారు. గచ్చిబౌలి పోలీసులు శ్రుతి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. కాగా, తన కూతురు శ్రుతి మృతిపై అనుమానాలు ఉన్నాయని తండ్రి వెంకటయ్య ఫిర్యాదు మేరకు గచ్చిబౌలి పోలీసులు అనుమానాస్పద మృతి కింద 194 బీఎన్ఎస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. లాడ్జిలో సీసీటీవీ ఫుటేజీతోపాటు పోస్టుమార్టం రిపోర్టు ఆధారంగా కేసు దర్యాప్తు చేపట్టనున్నట్టు పోలీసులు తెలిపారు.

## రైలు ఢీకొని బీహార్‌వాసి మృతి

మారేడ్‌పల్లి, సెప్టెంబర్ 16: పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టడడంతో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల వివరాల ప్రకారం బీహార్‌కు చెందిన అస్లాం (36) జీవనోపాధి నిమిత్తం నగరంలోని చర్లపల్లి ప్రాంతంలో నివాసం ఉంటూ స్థానికంగా ఓ చికెన్ సెంటర్‌లో హెల్పర్‌గా పని చేస్తున్నాడు. ఈనెల 15న అస్లాం రాత్రి తన పని ముగించుకొని ఇంటికి వెళ్లే క్రమంలో చర్లపల్లి రైల్వే స్టేషన్ వద్ద పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, నలుగురు పిల్లలు బీహార్‌లో ఉన్నారు.

### అకారణంగా దాడికి పాల్పడిన వారిపై కేసు

శంషాబాద్ రూరల్, సెప్టెంబర్ 16: బంధువుల ఇంటికి వచ్చిన వారిపై... ఆకారణంగా దాడి చేసిన ఇద్దరిపై కేసు నమోదైంది. సోమవారం శంషాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి సీఐ నరేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కాచారం గ్రామానికి చెందిన శైలజ ఆమె భర్త సురేశ్‌లు మండలంలోని ఊటుపల్లి గ్రామానికి చెందిన వారి బాబాయి రవీందర్ ఇంటికి 15వ తేదీ సాయంత్రం వచ్చారు. ఆదే సమయంలో ఊటుపల్లికి చెందిన కుమ్మరి ఆరవింద్, కుమ్మరి ప్రదీప్‌లు రవీందర్ ఇంటికి వచ్చి సురేశ్‌ను బూతులు తిట్టారు. ఎందుకు తన భర్తను తిడుతున్నారని శైలజ ప్రశ్నించగా ఆమెను సైతం దుర్భాషలాడుతూ సురేశ్ తలపై ఇనుప పైపుతో కొట్టారు. సురేశ్ తలకు గాయమైంది. అంతటితో ఆగకుండా తమ మూడు నెలల పాపను చంపుతామని బెదిరించినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

## విమోచన దినాన్ని అధికారికంగా నిర్వహించాలి



సికింద్రాబాద్, సెప్టెంబర్ 16: సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవిప్రసాద్‌గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్‌లో పర్యటించి అక్కడ జరుగుతున్న ఏర్పట్లను పరిశీలించారు. విమోచనంలో కీలకపాత్ర వహించిన సర్దార్ వల్లబాయ్ పటేల్ విగ్రహాన్ని గుజరాత్ తరహాలో తెలంగాణలో ప్రతిష్ఠించాలని పేర్కొన్నారు. నేడు ఉదయం 8 గంటలకు పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించే విమోచన దినోత్సవాలకు పెద్ద ఎత్తున నాయకులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, గజేంద్రసింగ్ షెకావత్, బండి సంజయ్ పాల్గొంటారని ఆయన తెలిపారు.